# కిటికీలోని కోమలి

శ్రీ వి. విశ్వనాథం

ఇల్లుకట్టి చూడు, పెండ్లిచేసి చూడు, అన్నట్లే 'కలకత్తాలో కాపరానికి కొంపచూడు' అనతగ్గది. ఈమూడు చేయకలిగినవాడు మహాఘనుడనే చెప్పాలి. ఇందులో ఏ ఒక్కటి చేయకలిగినా సమర్థుడనే అనిపించుకుంటాడు. అంటే ఇల్లు కట్టడానికి తగిన ఆర్థిక స్థిమితము, ఓర్పు, పెండ్లిచేయడానికి యీడుజోడు అయిన సంబంధము, కట్నకానుకలు వగైరాలకు వలసిన ఆర్థికస్తోమతు, కలకత్తాలో యిల్లు చూసుకోడానికి ఓర్పులోపం కారణంగా నుంటుంటవి. మాధవయ్య కనిపెంచిన తల్లిదండ్రులను దూరప్రాంతంలో వదలి గత్యంతరము లేక ఉద్యోగాన్వేషణకని కలకత్తాకు చేరాడు. ఉద్యోగమయితే త్వరగానే దొరకింది కాని ఉండటానికి కొంపకు మాత్రం విశ్వప్రయత్నంతో కూడిన శ్రమపడవలసి వచ్చింది.

ఇల్లు అంటే - ఊరినుండి రాబోయే యిల్లాలికి నచ్చాలి. పిల్లల చదువుకి పాఠశాల దగ్గరగా నుండాలి. కూరగాయల మార్కెట్, పచారీ సామానుల కొట్టు సమీపంలోనుండి తను యిల్లుండే వీధి విద్యుద్దీపాలతో కళ, కాంతులు కలిగియుండాలి. ఇలాంటి గొంతెమ్మ కోరికలు అందరికీ సహజం. వెదకి, వేసారితే చివరకు ఒక యింటిని సంపాదించాడు మాధవయ్య, వంద రూపాయలు అద్దె అయినా విశాలమైన గదులు, అందులోని కిటికీలు, సూర్యరశ్మి, గాలికి లోటులేకుండా యిల్లు వసతిగా అమరింది.

"కిటికీ చూడు
కిటికీలోని కోమలిని చూడు
కల్యాణం కావాలని
కోరి దీవించు!"

అని కోతుల నాడించువాడు పాడుతున్నాడు బయట యింటిముందు. పిన్నలు, పెద్దలు కోతుల ఆట చూస్తున్నారు. కోతులు ఆడించేవాడు చెప్పినట్లల్లా ఎగురుతున్నవి, దూకుతున్నవి, కూర్చుంటున్నవి, పరుగెత్తుతున్నవి, దాటుతున్నవి. 'అభ్యాసము కూసువిద్య' కాబట్టి నోరులేని జీవుల విషయంలోకూడ అది నిజమే కదా! ఆ కోతుల నాడించినవాడు దానివల్ల పొట్టపోసుకుంటాడు - యిప్పుడు, యికముందు కూడా.

మాధవయ్యగారి యింటిగది కిటికీకి అది ఎదురు కిటికీ. అందులోని కోమలి అప్సరసను మరిపించే సౌందర్యరాశి. కోతులవాడి రాకమూలంగా అదే మొదటిసారి మాధవయ్య ఆమెను చూడటం. అలా ఆమెను చూస్తూ ముగ్ధుడై కిటికీచువ్వలు పట్టుకొని ఎంతకాలం నిలబడ్డాడో చెప్పలేం.

కోతులాట అయిపోయినా ఆ యువతి తదేకధ్యానంతో తన్నే చూడడమెందుకు? నంపుసొంపులు గలవయ్యారి - పెండ్లయిందో లేదో పాపం! నవనాగరికపు పోకడలన్నీ యున్నవి. ఆమెతో ఒక్కసారి మనసార మాట్లాడాలనిపించింది. కాని ఏమంటుందో – ఛీవాట్లు ఛీదరింపుయి అమరవు కదా! ఆడవాళ్లను నమ్మలేం. అవునన్నది కాదనవచ్చు. కాదన్నది అవుననవచ్చు. ఆడవారి పోకడలకు అర్థాలే యుండవు ... యిలాటి యూహాలు శరపరంపరలుగా దొర్లిపోతున్న సందట్లో గడియారం గంట ఠంగ్ ఠంగ్ మని మ్రోగింది. ఉలిక్కిపడి ఆఫీసుకు టైమయిందని గబగబ ముస్తాబై బయలుదేరాడు. కాని కాళ్లు ముందుకు నడిస్తేగా! మరల యింకొకసారి కిటికీ దగ్గరకుపోయి చూచాడు కాని ఆ యువతి లేదు. ఇక ఆవేళ ఆఫీసుకు సెలవు చీటీవ్రాసి పంపించి గదిలోకిపోయి కుర్చీలో చేరగిలబడ్డాడు. సిగరెట్ వెంబడి సిగరెట్ తగలబడి పోతున్నది. ఆలోచనా సముద్రంలో దరి డొంక తెలియక కొట్టుకలాడేవారికి సిగరెట్లు ఎంతగానో తోడ్పడతవి.

అంతవరకు మాధవయ్య తన వివాహమును గురించికాని, కానున్న జీవితభాగస్వామిని గురించి కాని ఆలోచించి ఎరుగడు. కాని 'కిటికీలోని కోమలి' మాత్రం అతనిలో విప్లవం తెచ్చింది. ఆమె తనభార్య అయితే అదృష్టవంతుడనని యువ్విళ్లూరాడు.

సాయంకాలం 3 గంటలకు మరల ఆ యువతి కిటికీలో ప్రత్యక్షమయింది – తనవైపే చూస్తున్నది. నవ్వుతున్న ఆమె పెదవుల మధ్యనుండి తొంగి చూస్తున్న పలువరుస వేయివరహాలు విలువ కలదనిపించింది. 'నవ్వు నాలుగువిధాల చేటు' అని అనడం అలవాటయినా ఆమె నవ్వే వేరనిపించింది. ఆమె

నవ్వుతున్నప్పుడు బుగ్గలపై ఏర్పడే సొట్టలు ఆమె సౌందర్యాన్ని యినుమడింపచేసినవి. మాధవయ్య కూడ ప్రత్యుత్తరంగా ఒక చిరునవ్వు విసిరేశాడు.

ఆ రాత్రంతా మాధవయ్యకు మధురస్వప్నాలు — ఆ యువతి తన్ను ప్రేమించినట్లు, యిద్దరూ కలిసి కులాసాగా షికారు వెళ్లినట్లు, తన్నుతప్ప మరొకరిని వివాహమాడనని తన చేతులు పట్టుకొని బాసచేసినట్లు...యింకా...యింకా...

మరునాడు ఉదయం లేచాడుకాని పని ఏమీ తోచలేదు. కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ త్రాగివద్దామని హోటలుకు బయలుదేరి వెళ్లాడు. వర్షపు తుప్పరలు పడుతున్నా తిరిగి వస్తూయున్నంతసేపూ ఆ కోమలితో ఎలాగ పరిచయం చేసికోడమా యనేదే ఆలోచన. ఒక జాబు వ్రాసి కిటికీలోనుండి పడేస్తేనో! - లేక మధ్యవర్తిత్వానికి ఎవరైనా...అదేదీ నచ్చలేదు. ఇలాంటి ఆలోచనల పరంపరలతో తీరా వాళ్ల యింటి గుమ్మం దగ్గరకు వచ్చాడు. కాళ్లు వాటంతటవి గడపలెక్కి హాలులో కుర్చీలో కూర్చొని యున్న ముసలాయన దగ్గరకు వెళ్లినాయి. ఆయనను "తాయారురావుగారుండే యిల్లు యిదేనాండీ!" అని అడిగాడు.

ఆ ముసలాయన కాదన్నట్లు తలయూపి తాయారురావు ఎవరా! అన్నట్లు మాధవయ్య వంక చూచాడు.

"తాయారురావుగారు స్కూల్సు యిన్స్పెక్టరు. ఈ వీధిలోనే యున్నారని ఎవరో చెప్పారు. ఇంటి నెంబరు మాత్రం తెలియదు. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించాలి! శలవు" అని వెనక్కు తిరిగాడే కాని మాధవయ్యకు కదలాలనియుంటేగా!

మరల మాధవయ్య "ఆయనతో అర్జంటు పని యున్నదండీ! మధ్య యీ వర్షమొకటి చీకాకు పరుస్తున్నది" అంటూ చేతిరుమాలుతో ముఖం, ముంజేతులు తుడుచుకోసాగాడు.

"దానికేంలే — వాన వెలసిన తరువాతే వెళ్ల వచ్చు. రా అబ్బాయ్! వచ్చి కుర్చీలో కూర్చో" అన్నాడు ముసలాయన.

మాధవయ్య కుర్చీలో కూర్చున్నాడే కాని 'కిటికీలోని కోమలాంగి' కనుపిస్తుందేమోనని అటూయిటూ చూడసాగాడు. ఇల్లు శుభ్రంగా, అందంగా అలంకరించబడియున్నది. హాలులో ఒకప్రక్కన టేబిలు, దానిపై రంగురంగుల కాగితపు పూవులు, కుర్చీలు, సోఫాలు ముచ్చటగా నున్నవి. ఇంట్లో ఎవరూ లేరాయన్నట్లు నిర్మానుష్యంగా నున్నది. నిశ్శబ్దాన్ని బ్రద్దలు చేస్తూ ముసలాయన సంభాషణ మొదలు పెట్టారు.

"మీది ఏయూరు? యిక్కడ ఏం చేస్తున్నావు బాబూ?"

"మాది మదనాపుర అగ్రహారం. చదువయ్యాక యిక్కడికి ఉద్యోగానికని వచ్చి సిగరెట్ల కంపెనీలో గుమాస్తాగిరి చేస్తున్నాను. నాపేరు మాధవయ్య"

కొంచము సేపటికి వానదేవునికి వాయుదేవుడు తోడై కిటికీలలోనుండి జల్లుకొట్ట సాగింది. వాని తలుపులు వేయడానికి ముసలాయన లేవబోతుంటే మాధవయ్య వారించి తనే స్వయంగా లేచి కిటికీలు మూసాడు. కాని కోమలి కనుపించలేదనే నిస్పృహ మాత్రం అనుక్షణం ప్రబలిపోతున్నది.

"ఏం వానలు బాబూ! ప్రాణాలు తీసేటట్లున్నవి" అన్నాడు ముసలాయన చీకాకుతో

మాధవయ్య "అదేమిటండీ అలాగంటారు! ఏ కాలానికది యుండాలిగా! శీతాకాలంలో చలి లేకపోతే విడ్డూరపడతాం; చలి ఎక్కువగానుంటే యింత చలి ఎప్పుడూ లేదంటారు. ఏటేటా యిదే వరుస" అన్నాడు.

కళ్లజోడు సవరించుకుంటూ ముసలాయన "అబ్బాయ్! పెళ్ళయిందా నీకు" అని అడిగాడు చిరునవ్వుతో.

ప్రథమ పరిచయంలో సాధారణంగా ఎవరైనా అడిగే ప్రశ్న లేనని మాధవయ్యకు తెలిసినా తన ఉబలాటాన్ని పురస్కరించుకొని "యింకా లేదండీ! ఇప్పట్లో పెళ్లిచేసికోవాలనే యుద్దేశంకూడ లేదు. పెళ్ళిచేసుకొని అనేకమంది పడుతున్న యాతనలను చూస్తున్నాంగా! పావలా సంపాదించలేని పాపారావు పెళ్ళిచేసుకొని కుటుంబ పోషణకని పడుతున్న శ్రమం, చేస్తున్న పాడుపనులు అనేకం. గుంపెడు సంతానం, భార్య, వృద్ధాప్యంలో — ఆయన సుఖపడడానికా లేక తనమీద ఆధారపడినవారిని సుఖపెట్టడానికా యీ పెండ్లి చెప్పండి?" అని దీనితో పాటు మరి పది నిదర్శనాలు చూపిస్తూ పెండ్లిపట్ల తన అయిష్టతను తెలియజేశాడు.

"అలా కాదబ్బాయ్! మానవ జీవితయాత్రలో ఒడిదుడుకులున్నా స్త్రీపురుషులకు పరస్పరసహకార, సహాయాలు అత్యావశ్యకం. వానికి మూలాధారం ప్రేమానురాగాలు. వానిని పురస్కరించుకొని వివాహ సంబంధం. లోకంలో జరిగే పెళ్ళిళ్ళన్నీ ఒక తీరు పరిణామాలకు దారితీయవు. ఇదుగో చూడు — మా ఆవిడ ఉన్న మొన్న మొన్నటిదాక మా సుఖ సౌభాగ్యాలు ఎంతో చక్కగా నుండేవి. మా అన్యోన్యానురాగాలనుచూచి భగవంతుడు సయితము అసూయ పడ్డాడేమో! — ఆ యిల్లాలిని అలా తీసికొని పోయాడు." అన్నాడు కండ్లనుండి బొట బొట నీరు కారుస్తూ. వాన వెలసింది. వెళ్ళడానికి శలవు తీసికొని కుర్చీనుండి లేచాడు మాధవయ్య.

"మీరిక్కడేయున్నారు కాబట్టి అప్పుడప్పుడు వస్తూయుండబ్బాయ్!" అన్నాడు ముసలాయన సాగనంపుతూ.

లాగు మీదకు రెండు మడతలు పెట్టి మాధవయ్య ఎత్తెత్తి అడుగులు వేస్తూ రోడ్డుమీద నడుస్తున్నాడు. వెనుకనుండి "మాధవయ్యా! ఎక్కడికి బయలుదేరావు?" నారాయణరావు కేక వేశాడు.

మాధవయ్య ఆగక తప్పిందికాదు.

"ఏమిటి విశేషాలు? — తాతగారి యింట్లోనుండి వస్తున్నట్లున్నది!" అన్నాడు నారాయణరావు దగ్గరకువచ్చి.

"ఏమిలేదోయ్! బయలుదేరుదామని వీధిలోకివచ్చేసరికి వర్షం వచ్చింది. తడిసిపోకుండా వాళ్ళ యింట్లో ఎవరిని తెలియకపోయినా తాతగారి యింట్లో ప్రవేశింపక తప్పిందికాదు" అన్నాడు మాధవయ్య.

"బలేబాగుంది' తాతగార్నె తెలియదానీకు?' అన్నాడు నారాయణరావు మాధవయ్యతో ఆసక్తిని రేకెత్తిస్తూ.

నారాయణరావు మరల "ఆయన ఒక రిటైర్డు గెజెటెడు ఆఫీసరు. రెండవ భార్యకు రంభలాంటి కుమార్తెయుంది. ఆమెను కని తల్లి చనిపోయింది. అది ఆయనకు తీరనిలోటు. కుమార్తెనుమాత్రం శ్రమ అనుకోకుండా అల్లారు ముద్దుగా పెంచాడు. అయితే!..." అన్నాడు ముక్కు ఎగ బీలుస్తూ.

"రంభవంటి కూతురంటూ నీ వెందుకు దుగ్ధపడుతున్నావు" అన్నాడు మాధవయ్య.

"ఏమి చెప్పమన్నావు మాధవా? ఆమెకు పెళ్ళి చేసి, ఆస్థి పాస్తులు అప్పగించి తను పరలోకానికి పోవాలని ఆ ముసలాయన ఆరాటం."

"అయితే!"

"అయితే లేదు, గియితే లేదు. పిల్ల అందచందాలను ఆస్థిపాస్తులను చూచి అనేకమంది యువకులు ఉబలాటపడుతూ వచ్చి చూచేవారే కాని తీరా మూగదని తెలియంగానే వెనక్కు తిరిగి చూడకుండా వెళ్లిపోయారు. మరి నీవు ..." అన్నాడు నారాయణరావు.

మాధవయ్య ముఖం వెల వెలబోయింది. భగవంతుడికింత నిర్దయా అనుకున్నాడు లోలోపల.

మంచి తరుణము — మించిపోనీకుడు
సగము ధరలకే సరసకృతులు

శ్రీరామః లక్ష్మీస్వభావమును తెలుపు పద్యకృతి 0_6_0
ఆంజనేయ కవీయము (క్షేమేంద్రుని 'చారుచర్య' కనువాదం) 0_6_0
శ్రీ కృష్ణశాస్త్రీయము (నీలకంఠ దీక్షితుల కలివిడంబనమునకు ఆంధ్రీకరణము, 0_5_0
తిట్లదండకము (పూర్వకవి విరచితం)
5 ప్రతులు 0_15_0

మొత్తము 8 ప్రతులు ఈ జూను 30 తేది వఱకు రూ 1 యు, తపాలు సెలవుకు 15 న. పై.లు పంపు వారికి బుక్కుపోస్టు ద్వారా అందునట్లు చేయబడుతుంది.

ఉదయరంజనీ పబ్లిషర్సు,
66 సామిపిళ్ళె వీధి, చూళై
మద్రాసు - 7.